## క్లుప్తంగా

### మంచిగా జీవించండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని రౌడీషీటర్లకు ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు సూచించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా మంచిగా జీవించాలని హితవు పలికారు. వినాయక చవితి పండగ వేళ గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని బుద్ధిగా నడుచుకోవాలన్నారు. కౌన్సెలింగ్‌లో ఎస్ఐ అప్పలరాజు ఉన్నారు.

### బస్ డ్రైవర్, ప్రయాణికుడి మధ్య ఘర్షణ

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాటాకీస్ వద్ద ఓ ప్రైవేట్ బస్ డ్రైవర్‌కు ప్రయాణికుడికి మధ్య ఘర్షణ జరిగింది. అరగంట పాటు బస్‌ను రోడ్డు మీద నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఇద్దరి మధ్య చాలా సేపు గొడవ జరిగింది. వారి పంచాయతీ అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వద్దకు చేరింది. చివరికి ఎవరికీ వారు వెళ్లిపోయారు.


### వృద్ధురాలి మృతిపై ఫిర్యాదు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కైలాసపురం శాంతినగర్–2లో కె.ఆదియమ్మ(85) అనే వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటోంది. ఆమెకు కంటి చూపు తక్కువగా ఉండడం, ఒంట్లో బాగోకపోవడంతో ఇంట్లో కొడుకు, ఇతర కుటుంబ సభ్యులు వృద్ధురాలిని వైద్య సేవలు అందిస్తూ చూసుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఒంటి గంటకు ఆమెకు మాత్రలు ఇచ్చారు. సాయంత్రం వృద్ధురాలిని చూసేసరికి కళ్లు తేలేసి ఉండటంతో వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు ఆదియమ్మ ఆదివారం ఉదయం మృతిచెందింది. ఆమె కొడుకు కె.సూరిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలి మృతికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి సీతంపేట మధురానగర్‌లోని సాయిబాబా గుడి ఎదురుగా డోర్ నంబర్ 50–83–15లో గల టెర్రస్‌పై పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్, డీసీపీ నాగేంద్రుడు, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథారావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందితో పాటు రూ.85,510 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### సర్వీస్ రోడ్డులో భారీ వాహనాలు



సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తున్న లారీ

సీతమ్మధార: సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో భారీ వాహనాలు ప్రయాణించడంతో స్థానికులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం ఈ మార్గంలో ఓ లారీ ప్రయాణించడంతో చెట్టు కొమ్మలతోపాటు కేబుల్ వైర్లు తెగిపోయి కార్లపై పడ్డాయి. ఈ ప్రాంతంలో గొడౌన్‌లు ఉండటంతో ప్రతి రోజూ ఇక్కడికి వచ్చే భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, పోలీసులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.



# తొలి పూజకు వేళాయె..

- అంతటా వినాయక చవితి శోభ
- కిటకిటలాడిన రైతుబజార్లు, మార్కెట్లు

సీతంపేట: హిందువుల తొలి పండగ, విఘ్నాలకు అధిపతి అయిన వినాయక చవితి మహోత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. నవరాత్రి పూజలకు వాడవాడలా మండపాలు వెలిశాయి. చిన్న పెద్ద అనే తేడా లేకుండా అంతా ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణం, గోపురం, ఆలయం లోపల పూల దండలు, మామిడి తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు. సీతంపేట మెయిన్ రోడ్‌ను విద్యుత్ దీపాలు, ఎల్ఈడీ కటౌట్లతో అలంకరించారు.

**జోరుగా పూజా సామగ్రి విక్రయాలు..**

గణనాథుడికి తొలి పూజలు చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన పలు రకాల పత్రులు, పువ్వులు, పండ్లు కొనుగోళ్లతో రైతుబజార్లు, మార్కెట్లు కిటకిటలాడాయి. సీతంపేట, రామాటాకీస్, అక్కయ్యపాలెం, నరసింహనగర్ రైతుబజార్, ప్రధాన రహదారుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద రైతులు, వ్యాపారులు పూజా సామగ్రి, పత్రి, పువ్వులు విక్రయించారు. నేరేడు, మారేడు, జిల్లేడు, జామ, పనస, తులసి, యలమ, గరికి పత్రుల విక్రయాలు జోరుగా సాగాయి. 16 రకాల పత్రులను కట్టగా కట్టి విక్రయించారు. చామంతులు, గులాబీలు, కలువ పూలు, తమలపాకులు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, మామిడాకుల ధరలు ఆకాశాన్నంటాయి. పూజా సామగ్రి దుకాణాలన్నీ చవితి శోభను సంతరించుకున్నాయి.



నరసింహనగర్ రైతుబజార్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

రామాటాకీస్ జంక్షన్, సీతంపేట మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, రామచంద్రానగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను పెద్ద ఎత్తున విక్రయించారు. మట్టి ప్రతిమలకు డిమాండ్ ఏర్పడింది. కళాకారులు అప్పటికప్పుడే మట్టితో తయారు చేసినవి, ముందుగా తయారు చేసిన విగ్రహాలను వివిధ సైజుల్లో విక్రయాలు జరిపారు. అపార్ట్‌మెంట్లు, విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు, గృహస్తులు పెద్ద ఎత్తున విగ్రహాలు కొనుగోలు చేశారు. యువత ఊరేగింపుతో ఆటోలపై విగ్రహాలను మండపాల వద్దకు తరలించారు.



సీతమ్మధార రైతుబజార్‌లో జనం రద్దీ



సీతంపేటలో ముస్తాబైన దుర్గాగణపతి ఆలయం

**సీతమ్మధార రైతుబజార్ కిటకిట..**

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ ఆదివారం వినియోగదారులతో కిటకిటలాడింది. వినాయక చవితి పూజ సామగ్రి కోసం బారులు తీరి కొనుగోలు చేశారు. ఈవో కొండబాబు, సహాయకుడు ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. క్రైం పోలీసులు దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.



మర్రిపాలెంలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



అక్కయ్యపాలెంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన వినాయక ప్రతిమలు

**మార్కెట్లు కళకళ**

మర్రిపాలెం: మర్రిపాలెం జంక్షన్‌లో బీఆర్‌టీఎస్‌కు ఇరువైపులా వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలుకు భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. మర్రిపాలెం బజారంతా సందడి వాతావరణం నెలకొంది.

**కిక్కిరిసిన రోడ్లు**

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియాల్లోని మార్కెట్లు వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడిగా మారాయి. కంచరపాలెం రైతుబజార్ వినియోగదారులతో నిండిపోయింది. కంచరపాలెం కూడలి నేతాజీ ఫ్లైఓవర్ నుంచి ఊర్వశి జంక్షన్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో జనంతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.



కంచరపాలెం కూడలిలో వినియోగదారులు, వాహనాల రద్దీ



గణేష్‌నగర్‌లో సిద్ధం చేసిన మండపం

## ఘనంగా పందిరి రాట

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయ ఆవరణలో ఆదివారం వినాయక చవితి ఉత్సవాలకు ఘనంగా పందిరి రాట వేశారు. ఆలయ నిర్మాణ, నిర్వహణ సేవా సంఘం, ప్రధాన అర్చకులు, ఏడిద గురునాథ్‌శర్మ, అధ్యక్షులు టి.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి బి.కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పందిరి రాట వేస్తున్న త్రిముఖ విఘ్నేశ్వర ఆలయ నిర్మాణ, నిర్వహణ సేవా సంఘం ప్రతినిధులు

## నిబంధనలు తప్పక పాటించాలి

మర్రిపాలెం: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు నిబంధనలు తప్పక పాటించాలని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి స్పష్టం చేశారు. ఓల్డ్ ఐటీఐ జంక్షన్‌లోని కాగిత పైడయ్య కల్యాణ మండపంలో ఆదివారం వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద పాటించాల్సిన నియమ నిబంధనలను, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ప్రథమంగా పందిళ్ల ఏర్పాటుకు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అనుమతి, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఇసుక, నీరు ఏర్పాటు చేయాలని, దీపారాధన వల్ల మండపాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. విగ్రహాల ఎత్తు, బరువు, రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనాల వివరాలను విధిగా తెలియజేయాలన్నారు. లౌడ్‌స్పీకర్లు ఏయే సమయాల్లో ఎలా ఉపయోగించాలనేది చెప్పారు. బలవంతంగా విరాళాలు సేకరించడం, పటాసులు పేల్చడం వంటివి చేయకూడదన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలని సూచించారు. పండగ రోజు నుంచి నిమజ్జనం వరకు జరిగే వినాయక ఉత్సవాల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా, శాంతియుత వాతావరణంలో ప్రజలు పూజలు జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ముందస్తు చర్యల్లో భాగంగా నియమ నిబంధనలు సూచించామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉంటే ముందుగానే పోలీస్ అధికారులకు తెలియపరచాలని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలియజేశారన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్.సాయి, ఎస్ఐ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఉత్సవ నిర్వాహకులకు సూచనలిస్తున్న వెస్ట్ ఏసీపీ నరసింహమూర్తి

## సేఫ్టీ కోర్సులతో ఉపాధి అవకాశాలు


మురళీనగర్: సేఫ్టీ కోర్సులతో అనేక ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. ఇంజినీరింగ్ కాలేజీలో కెమికల్ సేఫ్టీ సూపర్‌వైజర్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో పరిశ్రమల్లో పనిచేస్తున్న వారు కూడా చేరవచ్చన్నారు. పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలు, వాటి నివారణ మార్గాలు, అగ్ని ప్రమాదాల నియంత్రణ, రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సి చర్యలు వంటి అంశాలపై శ్రీహరికోట ఇస్రోలో సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేసిన ఎ.వరహాలు ఎస్‌బీటీఈటీ మార్గనిర్దేశాలను అనుసరించి రూపొందించిన పాఠ్యపుస్తకాలను ప్రిన్సిపాల్ వెంకటరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కెమికల్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, అధ్యాపకులు సిహెచ్.ఎస్.ప్రసాద్, తులసీరావు, నూకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



సేఫ్టీ కోర్సుల పాఠ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

## లలితా పీఠంలో వేద విద్వత్ సభ





వేద పారాయణ నిర్వహిస్తున్న పండితులు, అనుగ్రహ భాషణం చేస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో ఆదివారం వేద విద్వాన్ సభ నిర్వహించారు. కుర్తాళం శంకరాచార్యులు, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సన్యాస స్వీకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన గురువర్యుడు కుర్తాళ పూర్వ పీఠాధిపతులు శివచిదానందభారతీ మహాస్వామికి గురుపూజ నిర్వహించారు. అనంతరం 108 మంది వేద పండితుల చేత వేద పారాయణ జరిగింది. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. వేద పండితులను ఘనంగా సత్కరించారు. సాయంత్రం పీఠంలో తెలుగు విజయం సాహితీరూపకం నిర్వహించారు. కుర్తాళపీఠ ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ఎర్నిమాంబకు విశేష పూజలు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ విశేష పూజలు చేశారు.

# మట్టి గణపతిని పూజిద్దాం



మట్టి గణపతి విగ్రహాలు అందజేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, అనిల్‌కుమార్‌రాజు



నరసింహనగర్ రైతుబజార్ వద్ద భక్తులకు మట్టి వినాయక ప్రతిమలు అందిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకుందామని, భక్తులందరూ మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఆదివారం ఆయన చేతుల మీదుగా భక్తులు, స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, ఏపీడీ పద్మావతి, పార్టీ శ్రేణులు సన్ని, నాని, రాజుయాదవ్, సన్యాసప్పలనాయుడు, బాబూరావు, నాయుడు, నేపాల్ శ్రీను, హరిపట్నాయక్ పాల్గొన్నారు.

**పర్యావరణ హితంగా పండగ**

సీతమ్మధార: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పిలుపునిచ్చారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని హైవే వెంచర్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్ప పుస్తకాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మావూరి మాట్లాడుతూ రంగుల వినాయక విగ్రహాలు అందరినీ ఆకర్షిస్తాయని, వాటి వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలు పూజలో వాడాలని, ఆరోగ్యానికి, వాతావరణానికి అవి మంచివని పేర్కొన్నారు. హైవే వెంచర్స్ అధినేత డాక్టర్ చింతాడ హేమారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది వినాయక చవితి ఉత్సవాలకు మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అనాథలకు నిత్యాన్నదానం ఉచితంగా చేస్తామన్నారు. భీమిలి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, బొడ్డేపల్లి చిరంజీవి, చింతాడ ఢిల్లేశ్వరరావు, పీఈపీ దేవానందరావు, ఎస్.మనోహర్, దీప్తి మహంతి, మాధవి, మౌనిక పాల్గొన్నారు.



49వ వార్డులో మట్టి విగ్రహాలను అందజేస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

**49వ వార్డులో 150 మందికి..**

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వార్డు సీవో పి.కె.రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు 150 మంది మహిళలు, కార్యకర్తలకు విగ్రహాలు, వినాయక వ్రతకల్పం పుస్తకాలను అందించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.ఢిల్లీరావు, ఎస్.చంద్ర శేఖర్, బి.దేముడు, ఎస్.రమణ, బి.శకుంతల, కె.కన్నయ్య, నాగరాజు, పి.చైతన్య, నాయుడు, ఎస్.శ్రీను, ఆర్.చంద్రమౌళి, ఎ.శ్రీను, సీహెచ్.శ్రీను, కె.మున్నా, ఎస్.శ్రీను, బి.శంకర్, శంకర్, జి.వెంకటరావు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

## వినాయక వ్రతకల్ప పుస్తకాల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం జైభారత్‌నగర్‌లో బీఎల్ఏ పోలిశెట్టి అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం వినాయక వ్రతకల్ప పుస్తకాలను ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి పంపిణీ చేశారు. వార్డులో సుమారు 400 మందికి ఈ పుస్తకాలను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు పి.పద్మ, నాయకులు అలేటి హేమంత్‌కుమార్, హంస కొండమ్మ, పద్మ, రామచంద్రారెడ్డి, సురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్రత పుస్తకాలు అందిస్తున్న రామారెడ్డి

## మండప అనుమతుల కోసం బారులు

సీతమ్మధార: వినాయక చవితి సందర్భంగా మండపాల నిర్వాహకులు పోలీస్ స్టేషన్ల వద్దగా భారీగా వచ్చారు. ఈ ఏడాది మండపాలు ఏర్పాటు చేసుకుని వారు తప్పనిసరిగా జీవీఎంసీ, ఎలక్ట్రికల్, ఫైర్ శాఖల వద్ద అనుమతులు తీసుకొస్తే పోలీసులు పర్మిషన్ ఇస్తామన్నారు. దీంతో ఆదివారం ద్వారకా, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చిన్నా, పెద్దా సుమారు 200 వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు మండపాల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. దీంతో పోలీస్ స్టేషన్లు నిర్వాహకులతో నిండిపోయాయి.

## ఉత్సాహంగా ఈత పోటీలు



ఈత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో రొంగలి జగన్నాథం తదితరులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆ పార్కు, డెకథ్లాన్ సంయుక్తంగా ఆదివారం స్పోర్ట్స్ ఉత్సవ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా పార్కు అనుబంధంగా ఉన్న ఈత కొలనులో ఈత పోటీలు నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ముఖ్య అతిథి జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం, స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ పార్కు కార్యదర్శి పొట్నూరు నాగరాజు, ఉపాధ్యక్షుడు బోయపాటి శ్రీనివాసరావు, స్విమ్మింగ్‌పూల్ ఇన్‌ఛార్జి సురేష్ కృష్ణన్, డెకథ్లాన్ మేనేజర్ జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.